
# బైరాగి భాగోతం



**ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ**

-కైపు ఆదిశేషారెడ్డి

"అమ్మాయ్... లీలా! యేం చేస్తున్నావేంటి...?" అంటూ వచ్చింది ఎదురింటి కాంతమ్మ.

"రండి... పిన్నిగారూ! కూర్చోండి..." అంది లీల.

"ఈ విషయం తెలుసా నీకు...?" కుర్చీలో కూర్చుంటూ అడిగింది.

"ఏ విషయం పిన్నిగారూ...!"

"కొంగల కోనకి పోయేదారిలో... పెద్ద వూడల మర్రి క్రింద... యెవరో బైరాగి స్వాముట...! వారం రోజులుగా జనాలు విరగబడి పోతున్నారు...! కళ్ల ముందరే మహిమలు చూపించి... కష్టాలు తీరుస్తున్నాడట...! నీకేదైనా పిల్లలు పుట్టే మార్గం చెపుతాడేమో... ఒకసారి వెళ్లి రారాదూ...!"

"ఎందుకులే పిన్నిగారూ! తిరగాల్సినవన్నీ తిరిగి... విసిగి పోయాను.

చివరకు గుండె దిటవు చేసుకొని... మా అన్నయ్య కొడుకుని తీసుకొచ్చి పెంచుకుంటున్నాం..." నిట్టూరుస్తూ అంది లీల.

"నష్టమేముంది లీలమ్మా...! ఒకసారి వెళ్లిరండి...! ఏ పుట్టలో ఏముందో...!" చెప్పింది కాంతమ్మ.

"చూద్దాం పిన్నిగారూ! ఆయనతో చెప్పి చూస్తాను..."

"సరేనమ్మా...! నాకు తెలిసిన విషయం చెప్పాను. తర్వాత మీ యిష్టం...! వస్తానమ్మా...! అవతల బోలెడు పనుంది..." అంటూ లేచి వెళ్లింది కాంతమ్మ.

ఆవిడ అటు వెళ్లగానే... లీల ఆలోచల్లో పడిపోయింది.

తనకి పెళ్లయి పన్నెండేళ్లు దాటిపోయాయి. రెండేళ్ల వరకు 'పుడతారులే తొందరేంటి...?' అనుకొంటూనే జరిగిపోయింది. ఆ తర్వాత నుండి మొదలైంది... పిల్లల గురించి ఆలోచన.

చుట్టుప్రక్కలవారు... చుట్టాలవారు, "ఏంటే... లీలా! యింకా విశేషం యేమీ లేదా...? ఆ ముచ్చటేదో త్వరగా కానిచ్చుకోండి...! ఆ తర్వాత ముసలాళ్లయిపోతారు...!" అంటూ వేళాకోళం మొదలెట్టారు.

మొదట్లో వారి మాటల్ని అంతగా పట్టించుకోకపోయినా... సంవత్సరాలు గడిచేకొద్దీ తనలో దిగులు మొదలైంది. పిల్లలకోసం తన మనసూ తాపత్రయ పడసాగింది.

పరీక్షించిన డాక్టర్లు... "లోపం యేమీ లేదు... కొంత కాలం నిరీక్షించండి..." అని చెప్పారు.

గుడులూ, గోపురాలు తిరిగింది.

ఉపవాసాలు, మొక్కుబడులు చేసింది.

యేళ్లు గడిచిపోయాయే గాని... తన కడుపు పండలేదు. క్రమంగా మనసు విరిగిపోయింది. తనకిక పిల్లలు పుట్టరనే నిర్ణయానికి వచ్చేసింది. శీనుని తెచ్చి పెంచుకొంటూంది.

సాయంత్రం తన భర్త యింటికి రాగానే... కాంతమ్మ చెప్పిన విషయం ప్రస్తావించి... "ఒకసారి వెళ్లొద్దాం...!" అంది లీల.

అయిష్టంగానే తలూపాడు రాఘవులు.

* * *

ఆదివారం ఉదయం పది గంటలకు ఆటో తీసుకొచ్చాడు రాఘవులు. యింట్లో ఒక్కడేనని శీనుని కూడా తీసుకొని బయలుదేరారు.

మెయిన్ రోడ్ దిగి, సన్నటి మట్టి బాటపై వెళ్లి వూడలమర్రి దగ్గర ఆగింది. ఆటో లోంచి ముగ్గురూ దిగారు.

అప్పటికే అక్కడ చాలా మంది జనం వున్నారు.

చెట్టు క్రింద పెద్ద పందిరి. దాని క్రింద పద్మాసనం వేసుకొని బైరాగి స్వామి. ఆయన చుట్టూరా జనాలు...!

విషయమేంటో తెలీని శీను పరిసరాలను ఆసక్తిగా గమనిస్తూ వున్నాడు.

చెట్టు క్రింద వున్న వారి లోంచి, కొందరు పందిరి క్రిందికెళ్లి బైరాగి స్వామితో మాట్లాడుతున్నారు. ఆయనేదో చెప్పగానే తలూపి వస్తున్నారు.

తమ వంతు రావటంతో లేచి బైరాగి స్వామి దగ్గరకు వెళ్లారు.

"మాకు పెళ్లయి పన్నెండేళ్లు అయింది. యింకా పిల్లలు పుట్టలేదు...!" క్లుప్తంగా చెప్పాడు రాఘవులు.

బైరాగి స్వామి తన ముందున్న పళ్లెంలోంచి ఒక కొబ్బరికాయను తీసుకొని, లీలకి దిష్టి తీసి... 'ఓం... హ్రీం...క్లీం...' అంటూ బిగ్గరగా మంత్రోచ్చారణ చేస్తూ, దానిని రాతి మీద 'ఠపీ'మని కొట్టాడు.

ఆశ్చర్యం...! అందులోంచి చిన్న చిన్న గాజుముక్కలు బయట పడ్డాయి...!

"అమ్మాయీ...! నీకు గర్భ దోషం వుంది. ఆ కారణంగానే నీకు పిల్లలు పుట్టలేదు. యిదిగో చూడు... నీ కడుపులో కల్మషం వుంది..." అంటూ గాజుముక్కలను చూపించాడు.

"ఏం చేయాలో మీరే చెప్పండి... స్వామీ...!" భయంగా చూస్తూ అడిగింది లీల.

"దీనికి నివారణ చేయాలి. నీ గర్భదోషం తొలగించాలి. ఆ తర్వాత పిల్లలు తప్పకుండా పుడతారు..." చిరునవ్వుతో చెప్పాడు బైరాగి స్వామి.

"మరి... నివారణ అంటే... యెలా...?" రాఘవులు అడిగాడు.

"వచ్చే ఆదివారం నాడు మళ్లీ రండి. నివారణ చేస్తాను. మీకు అన్ని విషయాలు నా శిష్యుడు చెపుతాడు. యిక వెళ్లొచ్చు..." చెప్పాడు బైరాగి స్వామి.

రాఘవులు శిష్యుడితో మాట్లాడాడు.

ఆయన చెప్పినదంతా విని, పట్టీ యివ్వగా... తీసుకొని యింటికి చేరారు.

ఇదంతా చూసిన శీనుకి విషయమేంటో పూర్తిగా అర్థంకాలేదు. కొబ్బరికాయ కొట్టగానే గాజుముక్కలు రావటం ఆశ్చర్యం కలిగించినా... అది లీలత్తకి గర్భదోషం అని చెప్పగానే భయం వేసింది.

* * *

మూడో పీరియడ్...! చంద్రశేఖరం మాస్టారు పాఠం చెపుతున్నాడు. ముందర బెంచీలోనే కూర్చోనున్న శీనుకి పాఠం మీదికి మనసు పోవటంలేదు.

క్రితంరోజు జరిగిన సంగతే గుర్తొస్తూంది. లీలత్త గురించి బైరాగి స్వామి చెప్పిన మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి.

తనంటే లీలత్తకి యెంతో యిష్టం. తనకూ అంతే...! ఊహ తెలిసినప్పటి నుండి లీలత్త దగ్గరే పెరిగాడు. యెప్పుడూ కబుర్లు చెపుతూ నవ్వించే లీలత్త గురించి... బైరాగి స్వామి చెప్పినప్పటి నుండి తనలో యేదో తెలియని ఆందోళన...!

"శీనూ!" చంద్రశేఖరం మాస్టారి గొంతు విన్పించటంతో వులిక్కి పడ్డాడు.

"చెప్పింది వింటున్నావా...? యేంటా పరధ్యానం..." అని, తిరిగి పాఠం చెప్పటంతో లీనమయ్యాడు చంద్రశేఖరం మాస్టారు.

తలూపి పాఠం వినసాగాడు శీను.

లంచ్ బ్రేక్‌లో శీనుని పిలిపించాడు మాస్టారు. యెప్పుడూ తన క్లాస్‌లో యెంతో యాక్టివ్‌గా వుండే అబ్బాయి... అలా డల్‌గా వుండటం ఆయనకు విస్మయం కలిగించింది. అదే అడిగాడు శీనుని.

క్రితంరోజు జరిగిందంతా పూస గుచ్చినట్లు చెప్పాడు శీను.

చెప్పిందంతా ఓపిగ్గా విన్నాడు మాస్టారు.

"నువ్వేం దిగులు పడకు. మీ అత్తయ్యకి యేమీకాదు. వచ్చే ఆదివారం నేను కూడా వస్తాను. బైరాగి స్వామితో మాట్లాడుతాన్లే...!" ధైర్యం చెప్పాడు.

మాస్టారిచ్చిన హామీతో శీనులో కొంత భయం తగ్గింది.

★ ★ ★

మళ్లీ ఆదివారం వచ్చింది. తమతో రావద్దని ముందుగానే శీనుకి చెప్పేశాడు రాఘవులు. కానీ... తనూ, తన క్లాస్‌లోని పిల్లలంతా చంద్రశేఖరం మాస్టారితో కలిసి వెళుతున్నట్లు మామయ్యతో చెప్పలేదు.

శిష్యుడు స్వామి యిచ్చిన పట్టీలోని వస్తువులు తీసుకొని, లీలతో కలసి బయలుదేరాడు రాఘవులు.

మాస్టారుతో కలసి శీను కూడా బయలుదేరాడు.

యెవరికివారు వూడల మర్రిని చేరుకొన్నారు. అప్పటికే అక్కడ చేరిన జనంలో టెన్షన్ కన్పిస్తోంది...! కారణం... బైరాగి స్వామి కన్పించడం లేదు. అందరిలో ఒకటే చర్చ... బైరాగి స్వామి యెక్కడికెళ్లాడు...?... అనేదే...!

అంతలో... "సోదర సోదరీ మణులారా! అందరూ ప్రశాంతంగా కూర్చోండి...! బైరాగి స్వామి గురించి చెపుతాను..." అంటూ మైక్ విన్పించింది పందిరి క్రింద నుండి.

అందరూ అటువైపు తిరిగారు.

అక్కడ ఒకతను... హేండ్ మైక్ పట్టుకొని, "బైరాగి స్వామి అత్యవసర పనిమీద వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత వస్తాడు. నేను ఆయనగారి శిష్యుడ్ని. స్వామిగారి ఆజ్ఞమేరకు కార్యక్రమాన్ని నేను కొనసాగిస్తాను..." అనగానే, జనాలంతా మౌనంగా కూర్చొన్నారు.

"మీరంతా యెన్నో సమస్యలతో బాధపడుతూ బైరాగి స్వామి వద్దకు వచ్చారు. మీకు నిరాశ కలగకూడదనే స్వామిగారి ఆజ్ఞమేరకు... నేను నా ప్రయత్నం చేస్తాను..." అంటూ మౌనంగా కళ్లు మూసుకొని కొద్దిసేపు ధ్యానం చేసి..., "నేను యిప్పుడు కొందరిని పిలుస్తాను... వారు యిక్కడకు రండి. సమస్యలను పరిష్కరిస్తాను... మొదటగా... రామాపురం నుండి వచ్చిన సుబ్బారావు రావాలి..." అని చెప్పాడు.

అందరూ వింతగా నలువైపులా చూస్తున్నంతలో, జనంలోంచి ఒకతను లేచి పందిరి దగ్గరకు వెళ్లాడు.

"సుబ్బారావు నీవేనా...?" గంభీరంగా అడిగాడు.

అవునన్నట్లు తలూపాడు సుబ్బారావు.

"నీకు శతృభయం యెక్కువైంది. వారివలన ప్రమాదం జరగవచ్చని నిద్రపోకుండా ఆలోచిస్తున్నావ్... అవునా...?" సుబ్బారావు కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

"నిజమే స్వామీ...! అయినవారే నా ఆస్తి కాజేయటానికి ప్లాన్ వేస్తున్నారు. యెప్పుడు... యెలా చంపుతారోననే భయంగా వుంది..." చెప్పాడు.

"భయపడకు...!" అని, తన చంకకు తగిలించుకొన్న సంచిలోంచి ఒక కొబ్బరికాయ తీశాడు. దానిని సుబ్బారావు నుదురుకు ఆనించి... మంత్రాలు ఉచ్చరించాడు. తర్వాత నేల మీద కొట్టాడు.

పగిలిన కాయలోంచి ఎర్రటి ద్రవం బయటకొచ్చింది.

"అమ్మో... రక్తం...!" ముందు వరుసలోని జనం అరిచారు.

సుబ్బారావు భయంతో గడగడ వణికిపోయాడు. వంగి ఆయన కాళ్లు పట్టుకొని, "రక్షించండి స్వామీ...!"అంటూ యేడ్వు మొదలుపెట్టాడు.

"నువ్వేం భయపడకు. నేనున్నాగా...!" అంటూ సంచిలోంచి తాయెత్తు తీసి, సుబ్బారావు చేతికి కట్టాడు.

తన జేబులోంచి రెండు వంద రూపాయల నోట్లు తీసి పళ్లెంలో వేసి, ఆయనకు పాదాభివందనం చేసి వెళ్లిపోయాడు సుబ్బారావు.

"కాశీపాళెం కనకమ్మ...!" మళ్లీ పిలిచాడు.

ఆమె లేచి వచ్చింది.

కనకమ్మకి దెయ్యం పట్టినట్లు నిరూపించి, విబూధి మంత్రించి యిచ్చాడు.

అలా వరుసగా పేర్లుపెట్టి పిలిచి, వారి సమస్యలు బయటపెట్టి... పరిష్కారంగా తాయెత్తులు, విబూధి, పండ్లు, పూలు యిచ్చి పంపసాగాడు.

బైరాగి స్వామి కంటే... ఈ స్వామే మేలని అందరూ గుసగుసలాడుకోసాగారు.

"తాళ్లపూడి నుండి వచ్చిన లీలగారు రావాలి..." అనగానే... లీల లేచి పందిరి దగ్గరకు వచ్చింది.



"రాఘవులు గారూ! చదువుకొన్న వారు... మీరూ యిలాంటి మోసాలను గ్రహించలేకపోయారా...? బాబాల, బైరాగుల మహిమలతో పిల్లలు పుట్టడం సాధ్యమేనా...? యెంతో అభివృద్ధి చెందిన విజ్ఞానం మన ముందుంది. మీకంతగా పిల్లలు కావాలంటే... చక్కటి సంతాన సాఫల్య కేంద్రానికెళ్లండి. ప్రయత్నించండి..."

"నీవు క్రిందటి వారం వచ్చావు. నీకు గర్భదోషం అని చెప్పాడు బైరాగి స్వామి. యిప్పుడు నివారణ కోసం వచ్చావు... అవునా...?"

"అవును... స్వామీ...!"

ఆయన తన సంచిలోంచి ఒక అరటి పండును తీసి... మంత్రించాడు. లీలకి యిచ్చి తినమన్నాడు. ఆమె దానిని కళ్లకద్దుకొని తీనేసింది.

ఆయన చిరునవ్వుతో... తన సంచిలోంచి కొబ్బరికాయ బయటకు తీశాడు.

దానిని లీల శిరస్సుకి తాకించి, "ఓం... హ్రీం... క్లీం..." అంటూ మంత్రోచ్చారణ చేస్తూ... నేల మీద కొట్టాడు.

అందులోంచి తెల్లని మల్లెపూలు బయటకొచ్చాయి...!

అందరూ విస్తుబోయి చూస్తున్నంతలో, "అమ్మాయీ! నీ గర్భదోషం తొలగింది. త్వరలో మల్లెపూవు లాంటి పాపాయి పుడుతుంది... సంతోషంగా వెళ్లు...!" అని చెప్పాడు.

లీల ఆయనకు నమస్కరించింది. యిదంతా చాటుగా చూస్తున్న శీను మనసు సంతోషంతో పొంగిపోయింది.

తర్వాత యెవరి వంతు వస్తుందోనని... అందరూ వూపిరి బిగబట్టి చూస్తున్నంతలో... చంద్రశేఖరం మాస్టారు వచ్చాడు. మైక్ అందుకొన్నాడు.

"సోదర సోదరీమణులారా! యింతవరకు ఈయన మీకు చూపించినవన్నీ మహిమలు కాదు. అంతేకాదు... యింతకాలం బైరాగి స్వామి చూపినవన్నీ కూడా మహిమలు కాదు. మీరు నిశ్శబ్దంగా వుంటే... అసలు విషయం చెప్తాను..." అంటూ అందరి వంక చూశాడు మాస్టారు.

అందరూ నిశ్శబ్దంగా మాస్టారి వంక చూడసాగారు.

"నాలుగురోజుల క్రితం నా స్టూడెంట్... శీను అనే అబ్బాయి యిక్కడి విషయాలు నాతో చెప్పాడు... అవి విన్న తర్వాత బైరాగి చేస్తున్న మోసం అర్థమైంది. యెలాగైనా అతని భాగోతాన్ని బయటపెట్టాలని నా మిత్రులను పిలిపించాను. విజయ అనే యితను నా మిత్రుడు..." అంటూ అంతవరకు మహిమలు చూపిస్తున్నతన్ని పరిచయం చేశాడు.

విజయ్ అందరికీ నమస్కరించాడు. బాధితులుగా నటించిన మిత్రులను చూపించాడు.

తర్వాత... మాస్టారు యిచ్చిన సైగలు అర్థంచేసుకొన్న విజయ్... తన సంచిలోంచి ఒక కొబ్బరికాయను తీసి అందరికీ చూపించి నేల మీద కొట్టాడు.

అందులోంచి పూలు బయటకు వచ్చాయి.

అలాగే... మరో కాయ... యింకో కాయ... ఒక దాని తర్వాత మరొకటి తీసి నేలమీద కొట్టాడు.

ఒక్కో కాయలోంచి... ఒక్కో పదార్థం బయట పడింది...! అందరూ వింతగా చూస్తున్నారు.

"ఆశ్చర్యంగా వుంది కదూ...! కొబ్బరి కాయల్లోంచి యిన్ని రకాల పదార్థాలు యెలా వచ్చాయో... విజయ్ మీకు ప్రత్యక్షంగా చేసి చూపిస్తాడు..." చెప్పాడు మాస్టారు.

అందరూ ఏకాగ్రతగా విజయ్ వంక చూడసాగారు.

అక్కడకు వచ్చిన వారినుండి ఒక కొబ్బరికాయ తీసుకొని, దాని జుట్టు క్రింద వుండే కన్నులు చూపించి, సన్నటి తీగతో ఆ కన్నులున్నచోట రంధ్రం చేశాడు. కాయలోంచి నీరంతా బయటకు వచ్చేసింది.

సన్నటి గాజుముక్కలు, పువ్వులను ఆ రంధ్రాల లోంచి నేర్పుగా కాయ లోపలకు యెక్కించాడు. మైనంతో ఆ రంధ్రాలను పూడ్చివేశాడు.

దానిని కొట్టి చూపించాడు.

అందరూ ముక్కున వేలేసుకొన్నారు.

"యిదే...! బైరాగి భాగోతం...! కొబ్బరికాయ రహస్యం...! కొబ్బరి కాయ మీద యేదో ఒక గుర్తు పెట్టుకొని... సందర్భాన్నిబట్టి ఉపయోగించాలి..." చెప్పాడు విజయ్.

బైరాగి మోసాన్ని అర్థంచేసుకొన్న జనమంతా చప్పట్లు కొట్టారు. కొద్దిసేపు ఆ ప్రదేశం కరతాళ ధ్వనులతో మార్మోగిపోయింది.

"ఆ మోసగాడు యెక్కడ...?" జనంలోంచి ఆవేశంగా అడిగారు.

"ఆ మోసగాడు నిన్ననే పారిపోయాడు. నిన్న సాయంత్రం వచ్చి మోసాలు మానుకోకపోతే... ప్రజల్లో నిలదీస్తాం..." అని చెప్పాము దాంతో తన భాగోతం బయట పడితే... ప్రజలు చావగొడతారనే భయంతో చెప్పాపెట్టాకుండా రాత్రికిరాత్రే... వుడాయించాడు..." జరిగిన సంగతి వివరించాడు మాస్టారు.

మరోసారి ఆ ప్రాంతం కరతాళ ధ్వనులతో మార్మోగింది.

శీనుని వెంట బెట్టుకొని లీల, రాఘవుల దగ్గరకొచ్చాడు చంద్రశేఖరం మాస్టారు.

"రాఘవులు గారూ! చదువుకొన్నవారు... మీరూ యిలాంటి మోసాలను గ్రహించలేకపోయారా...? బాబాల, బైరాగుల మహిమలతో పిల్లలు పుట్టడం సాధ్యమేనా...? యెంతో అభివృద్ధి చెందిన విజ్ఞానం మన ముందుంది. మీకంతగా పిల్లలు కావాలంటే... చక్కటి సంతాన సాఫల్య కేంద్రానికెళ్లండి. ప్రయత్నించండి..." నవ్వుతూ అన్నాడు.

"లేదు... మాస్టారూ! లీల మానసిక బలహీనతని కాదనలేక వచ్చాను. ఆవిడ తృప్తికోసం... యిష్టంలేకున్నా... సరేనన్నాను..." చెప్పాడు రాఘవులు.

"మాస్టారూ...! యిక మా అత్తయ్యకి పిల్లలు పుట్టరా...?" దిగులుగా అత్తయ్య వైపుచూస్తూ అడిగాడు శీను.

"నాకు పిల్లలు లేరని యెవరు చెప్పారు... వీడే నా బిడ్డ...!" అంటూ శీనుని అక్కున చేర్చుకుంది లీల. ఆమె కళ్లు ఆనందంతో చెమర్చాయి.

ప్రతి పసిబిడ్డని తన బిడ్డగా చూడగల మాతృ హృదయం వుంటే చాలు... మాతృమూర్తే కానక్కర్లేదు...! లీల కళ్లలోని ఆనందాన్ని చూశాక... వారి వంక తృప్తిగా చూస్తూ విజయ్ వైపు నడిచాడు చంద్రశేఖరం మాస్టారు. ★